
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
శనివారం 29 మార్చి 2025





పిడుగురాళ్ల జెడ్పీ పాఠశాలలో పనిచేయని ఆర్‌ఓ ప్లాంటు

# బెల్ సరే.. మరి నీళ్లెలా?

## విద్యార్థులకు అందని శుద్ధ జలం



- పిడుగురాళ్లలోని జడ్పీ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి తెచ్చినా విద్యుత్ కొరత, ఫిల్టర్లు మార్చకపోవడం, విద్యుత్ వైర్లను ఎలుకలు కొరికేయడం వంటి కారణాలతో మొక్కుబడిగానే ఉన్నాయి. విద్యార్థులకు ఉపయోగపడటంలేదు. ఆర్వో ప్లాంట్లు పనిచేయక పిడుగురాళ్ల మండలం కరాలపాడు, బ్రాహ్మణపల్లి,
- గురజాల మండలం మాడుగుల, దాచేపల్లి మండలంలో మాదినపాడు, రామాపురం, పెదగార్లపాడులో, మాచవరం మండలంలోని మోర్జంపాడు, పిన్నెల్లి పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.
- వినుకొండ మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 33 పాఠశాలల్లో ఆర్వో పాంట్లు ఏర్పాటు చేసినా అవి పూర్తి స్థాయిలో పనిచేయడంలేదు. ఉప్పరపాలెం, చాట్రగడ్డపాడు, దొండపాడుల్లోని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయి. చాట్రగడ్డపాడులో ట్యాంక్, ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు.



వినుకొండ: దొండపాడు ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

ఎండలు మండుతున్నాయి.. ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. అయినా విద్యార్థులు ఎండ వేడికి అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో 'వాటర్ బెల్' అమలు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. వేసవి తాపానికి గురికాకుండా విద్యార్థులకు గంటకో సారి మంచినీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశించింది. అయితే వాటర్ బెల్ కొట్టినా విద్యార్థులకు శుద్ధ జలం ఎలా అందించాలో తెలియక ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వందల్లో విద్యా ర్థులు ఉన్నా శుద్ధ జలం అందుబాటులో లేదం టే ఆశ్చర్యం కాదు. ఇక గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినా నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. చాలాదగ్గర్ల వాటిని ఇప్పటికీ బిగించలేదు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి లేదంటే పాఠశాల సమీపంలోనే నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

- పాఠశాలల్లో అలంకార ప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- రూ.లక్షలతో ఏర్పాటు.. నిర్వహణ లేక నిరుపయోగం
- కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలను బిగించని వైనం
- మరమ్మతులపై ఫిర్యాదులను పట్టించుకోని ఏజన్సీలు

(ఆంధ్రజ్యోతి - పల్నాడు న్యూస్‌నెట్‌వర్క్)

ఎండలతో పాటు వాతావరణంలో వేడి రోజు రోజుకు తీవ్రమవుతోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గంటగంటకు నీరు తాగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. ఇళ్ల నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు అన్న పరిస్థితి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే అవి మూణ్నాళ్ల ముచ్చటగానే పని చేశాయి. ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే లేరు. అటు ఇటు అధికారులు, ఇటు సంబంధిత ఏజన్సీల వారు ఆర్వో ప్లాంట్ల గురించి పట్టించుకోవడంలేదు.

దీంతో పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో పాఠశాలల్లో దొరికే నీరు శుభ్రంగా లేకపోవడంతో (మిగతా 6వ పేజీలో)

ఆంధ్రజ్యోతి ఫోకస్

### నిర్వహణ.. నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని చాలాదగ్గర్ల బిగించలేదు. బిగించిన దగ్గర్ల మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారేలేరు. ఏర్పాటుతో సరిపెట్టిన కంపెనీల ప్రతినిధులు నిర్వహణ మరిచారు. ప్రధానోపాధ్యాయులు మరమ్మతుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించినా ప్లాంట్ల గురించి పట్టించుకునే వారే లేరు. ప్లాంట్‌లు బిగించిన వారికి ఫోన్ చేస్తే మొక్కుబడిగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. దీంతో ఆర్వో ప్లాంట్లు ఆయా పాఠశాలలో మూలనపడి నిరుపయోగంగా ఉన్నాయి. స్కూల్ గ్రాంట్‌తో మరమ్మతులకు ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనా ఆర్వోప్లాంట్ విడి పరికరాలు ఎక్కడా దొరడంలేదు. దీంతో ప్లాంట్‌ను పాఠశాలకు పంపిణీచేసిన ఏజన్సీ వారు వస్తే తప్ప వాటి మనుగడ కొనసాగలేని పరిస్థితి.

# బిల్లులు.. బాధలు

- అప్పుల భారంతో కాంట్రాక్టర్లు సతమతం
- గతంలోనూ ఇప్పుడూ ఒకే తీరుగా అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.800 కోట్ల బకాయిలు
- బ్యాంకు ఖాతాలకు మార్చి 31 డెడ్‌లైన్.. ఆలోగా చెల్లించకపోతే ఎన్‌పీఏ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు చేసిన నేరానికి చిన్నా చితక కాంట్రాక్టర్ల జీవితాలు చిన్నాభిన్నమైపోతున్నాయి. గత ప్రభుత్వం చేసిన పాపాలను కడిగేస్తున్న కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్ఎంఈ) కేటగిరి కాంట్రాక్టర్లు సుమారు 450 మంది గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలకు సంబంధించి కాంట్రాక్టులు చేశారు. గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ సహా జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టులు చేసిన వీరికి గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో చేసిన పనలకు సంబంధించి రూ.150- 200 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు సంబంధించి రూ.50-70 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో రూ.100- 150 కోట్లు బకాయిలు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో చేసిన పనులకు రూ.70 కోట్ల వరకు బకాయిలు ఉండగా, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పనులకు సంబంధించి రూ.10 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవే కాకుండా కొవిడ్ సమయంలో ఆర్ అండ్ బీ పరిధిలో పలు చోట్ల పీహెచ్‌సీల నిర్మాణం, పాత వాటి ఆధునికీకరణలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.160 కోట్లు ఉండగా, ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

**● నిధులివ్వని గత ప్రభుత్వం**

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నిధులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఒకవేళ ఇచ్చినా మొత్తం కాంట్రాక్టు ఖర్చులో 15 శాతానికి మించి ఇవ్వలేదని చెబుతున్నారు. అది కూడా సీరియల్ ప్రకారం కాకుండా అయిన వారికే ఇచ్చుకున్నారని వాపోతున్నారు. గత ప్రభు త్వం తెరమీదకు తెచ్చిన ఈ అడ్డదారినే ఈ ప్రభు త్వంలో కూడా అధికారులు కొనసాగిస్తున్నారని, దీంతో సామాన్య కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని తెలిపారు. సీరియల్‌ప్రకారం కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

**● బ్యాంకుల నుంచి నోటీసులు**

కాంట్రాక్టర్లు అనేక మంది బ్యాంకుల వద్ద ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో అప్పులు చేస్తారు. వాటికి ఏ ఏడాదికా ఏడాది వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ వడ్డీలు చెల్లించలేదు. మరో మూడు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుండడంతో వడ్డీలు చెల్లించని కాంట్రాక్టర్ల కు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. మూడు రోజుల్లోపు వడ్డీలు చెల్లించకపోతే సదరు ఖాతాలను నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) జాబితాలోకి చేరుస్తామని నోటీసుల్లో హెచ్చరించాయి. ఒకసారి ఖాతా ఎన్‌పీఏ పరిధిలో పెడితో సంబంధిత కాంట్రాక్టరు స్థిర, చర ఆస్తులు వేలానికి వెళతాయని, ఆ ప్రమాదం నుంచి కాపాడమని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.

**న్యాయం చేయాలి**

ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. చిన్న, సన్నకారు కాంట్రాక్టర్లు బిల్లులు రాక అప్పులపాలయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అనేక మంది పరిస్థితి అలానే ఉంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. సీరియల్ ప్రకారం అందరికీ బకాయిలు చెల్లించాలి. **- ఎస్.విజయ్‌కుమార్, సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు**



# వరించిన పదవులు

- 3 జిల్లాలు.. ఐదుగురికి అవకాశం
- మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం
- మిగతా ఏఎంసీలకు ఉగాదికి నియమించే అవకాశం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉగాదిలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా.. ఆయా పదవులు ఎవరిని వరిస్తాయోనని నేతలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవులను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఐదు మార్కెట్ యార్డులు ఉండగా ఐదుగురిని ఏఎంసీ చైర్మన్ పదవులు వరించాయి. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా యార్డులకు సంబంధించిన డైరెక్టర్లను త్వరలో నియమించనున్నారు. కాగా శుక్రవారం ప్రకటించిన చైర్మన్ పదవుల నియామకంపై స్థానిక కేడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం అహరహం శ్రమించిన వారికే పదవులు కట్టబెట్టారని కొనియాడుతున్నారు.

**ఆశావహుల ఎదురుచూపు..**

మార్కెట్ పాలక వర్గాలకు సంబంధించి మరికొందరికి డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి. యార్డులకు సంబంధించి ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో చైర్మన్, వైస్‌చైర్మన్, డెరెక్టర్ల పదవులకు పేర్లను ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. అయితే మరో రెండు, మూడు రోజుల్లో భారీ సంఖ్యలో పదవుల పందేరం జరిగే అవకాశం ఉండటంతో ఆశావహులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు మార్కెట్(మిర్చి) యార్డు, దుగ్గిరాల మార్కెట్(పసుపు) యార్డు చైర్మన్ పదవులు అత్యంత కీలకమైనవి. గుంటూరు మార్కెట్ యార్డు ఆసియాలోకే పేరొందింది. దీన్ని జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. ఈ పదవి కోసం అనేక మంది సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న దుగ్గిరాల మార్కెట్ యార్డు పదవికి కూడా చాలామంది పోటీ పడుతున్నారు. ఈ యార్డును ఎస్సీలకు రిజర్వ్ చేసినట్లుగా సమాచారం. ఈ చైర్మన్ల నియామకం ఉగాదికి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

● జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి టీడీపీ సీనియర్ నేత, పమిడిపాడుకు చెందిన పూనాటి శ్రీనివాసరావును వరించింది.

● సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కోమటినేని శోభారాణికి దక్కింది. సత్తెనపల్లి ఏఎంసీ చరిత్రలో తొలి మహిళా చైర్మన్ కావడం గమనార్హం. సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన శోభారాణి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు సతీమణి. 2013లో ఆమె ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందారు.

● మంగళగిరి యార్డు చైర్మన్‌గా జవ్వాది కిరణ్ చంద్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆయన విద్యార్థి దశ నుంచే టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నారు. పెదవడ్లపూడికి చెందిన కిరణ్ కుటుంబీకులంతా మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు.

● బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కావూరి శ్రీనివాసరెడ్డిని వరించింది. ఆర్మీలో పనిచేసిన ఆయన 2014లో రాజకీయాలపై ఆసక్తితో టీడీపీలో చేరారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పార్టీ విజయం కోసం శ్రమించారు.

● అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా వరగాణి పద్మావతిని పదవి వరించింది.



బాపట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



అద్దంకి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మావతి



పి. శ్రీనివాసరావు



జవ్వాది కిరణ్‌చంద్



ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన శోభారాణి





# సమస్య చెప్తుంటే తలనొప్పి అంట

- తహసీల్దారుపై కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు
- ఇదేమి సమాధానం అంటూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

నాదెండ్ల, మార్చి 28 ఆంధ్రజ్యోతి): సార్.. మా సమస్య చెప్తుంటే మా వల్ల కాదు, తలనొప్పి వస్తుందని తహసీల్దారుకు అంటు న్నారు అని ఇర్లపాడు గ్రామానికి చెందిన రంగ నాథుల బ్రహ్మయ్య కలెక్టర్ అరుణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మనం ఉద్యోగులం.. ఇదేనా మీరు చెప్పే సమాధానం.. అంటూ తహసీ ల్దార్, సర్వేయర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సర్వే నిర్వహించి బ్రహ్మయ్య సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌ను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారాలపై కలెక్టర్ శుక్రవారం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా మండలంలోని అప్పాపురం, ఇర్లపాడు గ్రామాల్లో ఫిర్యా దుదారులను కలసి అధికారుల స్పందనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యను కల వగా అధికారుల తీరుపై ఫిర్యా దు చేశారు. ఆ తర్వాత కలెక్టర్ ఇర్లపాడు గ్రామానికి వెళ్లి మస్తాన్‌వలిను కలిశారు. ప్రస్తుత సచివాలయం పది కిలో మీటర్ల దూరంలో ఉన్నందున గ్రామస్తులకు అందు బాటులో నూతన సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరగా సమస్య ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే సరైన పరిష్కారం లభిస్తుం దని, అవసరమైతే అధికార యంత్రాంగం మొత్తం కదలి వస్తుందనే భరోసా కల్పిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మరింత ఫల ప్రదంగా నిర్వహించేందుకే అర్జీ దారులను నేరుగా కలుస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో ఎస్ స్వరూ పరాణి, ఈవోపీఆర్‌డీ నిర్మలలక్ష్మీకుమారి, కార్యదర్శు లు లక్ష్మీనారాయణ, మధు తదితరులు ఉన్నారు.



అప్పాపురంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

# నేను రాలేను.. మా ఆయన వస్తారు

- సత్తెనపల్లి చైర్‌పర్సన్ లక్ష్మీతులసి ప్రకటన
- మున్సిపల్ చాంబర్‌కు రాలేనని ఎమ్మెల్యే కన్నాకు వివరణ

సత్తెనపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలు మున్సిపల్ ఛాంబర్‌కు రాను.. నా బదులు మా ఆయన వస్తారు.. అని సత్తెన పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లచర్ల లక్ష్మి తులసి కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం బహిరంగంగా ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహా కౌన్సిలర్లు, అధికా రులు విస్తుపోయారు. శెలవు పెడుతున్నా వమ్మా.. అని ఎమ్మెల్యే కన్నా ప్రశ్నించగా లేదు కౌన్సిల్ సమావేశాలకు హాజరవుతాను, మూడు నెలల పాటు ఇంట్లో పనులు ఉన్నాయని సమాధానమిచ్చారు. దీంతో ఎమ్మెల్యేకి ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. చైర్‌పర్సన్ చాంబర్‌ను పార్టీ కార్యాలయంగా మార్చారని ఇటీవల ఏడో వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ ఎమ్మెల్యే కన్నాకు ఫిర్యాదు చేశారు. దీంతో చైర్‌పర్సన్ వస్తేనే చాంబర్‌ను తెరవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ నేపథ్యంలో లక్ష్మీతులసి తన బదులు తన భర్త వస్తారని చెప్పినట్లు అర్థమవుతుంది.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ : 6.25 (శనివారం సాయంత్రం)
సహరి : 4.48 (ఆదివారం ఉదయం)

## కోరం లేక కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక వాయిదా


ఎన్నికల అధికారి లింగమూర్తి

కారంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక రెండో రోజు శుక్రవారం కూడా వాయిదా పడింది. ఉప ఎంపీపీ ఎన్నికకు సంబంధించి 14 మంది ఎంపీటీసీలకు గాను పేటసన్నిగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి ఒక్కరే హాజరు కావడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి డీఈ లింగమూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభం కాగా 12 గంటల వరకు వేచి చూసినప్పటికీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామని చెప్పారు.

## కాటూరికి కళారత్న పురస్కారం


శిల్పి వెంకటేశ్వరరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ అధినేత శిల్పి కాటూరి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డుతో సత్కరించనుంది. శిల్పాలను వివిధ రకాల మెటీరియల్స్‌తో తయారుచేసి దేశ విదేశాలలో సైతం ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఉగాది పురస్కారాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును అందించనుంది.





# దేశంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచి

### రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

గుంటూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యం అవుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆరోగ్య ఎమర్జెన్సీ సమయంలో మానవాళి ఆరోగ్యం, రైతుల సంక్షేమంతో పాటు, భూ గ్రహ పరిరక్షణ కూడా ప్రకృతి వ్యవసాయంపైనే ఆధార పడిందని అభిప్రాయపడ్డారు. జాతీయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో గుంటూరులో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం చివరి రోజున విజయ్ కుమార్ వర్చువల్‌గా శిక్షణకు హాజరైన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు కూడా వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత తరహాలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఏర్పాటైన మిషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని దేశ వ్యాప్తంగా విస్తరించాలని కోరారు. ప్రకృతితో మమేకమై ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు అమలవుతున్నాయని, ప్రస్తుతం అనుసరిస్తున్న రసాయన వ్యవసాయ విధానాలపై పునరాలోచించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయత, సార్వత్రిక సూత్రాలు, అనుసరిస్తున్న విధానాలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ, సెర్ప్ అధికారులకు ఏ మేరకు అవగాహన కలిగింది అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అంతకు ముందు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వరప్రసాద్ ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రంలో చేసిన వివిధ పరిశోధనల ఫలితాల గురించి వివరించారు.


రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

సీనియర్ థిమాటిక్ లీడ్ డాక్టర్ జాకీర్ ప్రకృతి వ్యవసాయంలో పంటల నిరోధకత (క్రాప్ రెసిలియన్స్ ) పై అధికారులకు అవగాహన కల్పించారు. గోపీచంద్ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అవసరం అయ్యే ప్రణాళిక, శిక్షణలు, క్షేత్ర స్థాయి కార్యక్రమాల గురించి విపులంగా విశదీకరించారు. చంద్రశేఖర్ క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు దోహదం చేసే కార్యక్రమాలు, నాన్ పెస్ట్ మేనేజ్‌మెంట్ దుకాణాలు, మహిళా సంఘాల పాత్ర గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ లు రామచంద్రం, రాజేశ్వర్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రకృతి వ్యవసాయంపై అనేక రకాలుగా అవగాహన కల్పించినందుకు రైతు సాధికార సంస్థకు, మేనేజ్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు.

# ఈకేవైసీ నమోదుకు ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు

**● ఎండీయూల ద్వారా కూడా చేసేందుకు ప్రతిపాదన ● కార్డుదారుల ఆందోళన తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాలు**

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రేషన్‌కార్డులోని సభ్యుల పెండింగ్ ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేయడానికి ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత ఈ నెలాఖరు వరకే ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే చాలామంది సభ్యులు అందుబాటులో లేకపోవడం, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటం వంటి కారణాలతో ఈకైవేసీ సంపూర్ణం కాలేదు. దీంతో మరో నెల పాటు గడువుని పొడిగిస్తూ శుక్రవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాలకు సమాచారం పంపించింది. ఈకేవైసీ పెండింగ్ ఉన్న వాళ్లకు ఏప్రిల్ నెల రేషన్ పంపిణీ నిలిచిపోతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని, మరో నెల పాటు గడువుని ప్రభుత్వం పొడిగించిందని గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పౌరసరఫరాల అధికారులు సమాచారం ఇవ్వడం ప్రారంభించారు.

ఆధార్ అథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేస్తారు. ఇది ఒక విధంగా ఈపీఎఫ్‌వో ఫించన్‌దారులు ఏ విధంగా అయితే ఏటా లైఫ్ సర్టిఫికేట్‌లు ఇస్తారో అలాంటి ప్రక్రియే. ఎప్పటినుంచో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది సభ్యుల ఈకైవేసీ పెండింగ్‌లో ఉన్నది. గుంటూరు జిల్లాలో 1,34,943, పల్నాడు జిల్లాలో 1,68,886, బాపట్ల జిల్లాలో 95,780 మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇప్పటికే ఎవరివైతే ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయో వారి వివరాలతో కూడిన లిస్టులను విడుదల చేశారు. అయితే కొంతమంది మాత్రమే ముందుకొచ్చి ఈకేవైసీని రేషన్ దుకాణాల్లో చేయించుకొన్నారు. ఇంకా చాలామందివి అలానే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు కారణం విద్యార్థులు హాస్టల్స్‌లో ఉండటం, వ్యవసాయ కార్మికులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటమే. అలానే కొంతమంది చనిపోయినప్పటికీ వాళ్ల పేర్లను స్వచ్ఛందంగా తొలగించకుండా ప్రతీ నెలా రేషన్ పొందుతున్నారు.

ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ రెండు వ్యవస్థల ద్వారానే జరుగుతున్నది. రేషన్ డీలర్ల వద్ద ఈ-పోస్ యంత్రాలలో ఆధార్ అథెంటికేషన్(వేలిముద్ర) వేసి చేసుకోవచ్చు. వీఆర్‌వోల వద్ద అయితే ఆధార్‌తో పాటు ఐరిస్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా కూడా ఈకేవైసీ చేసుకొనే సదుపాయం ఉన్నది. ఈ సదుపాయాన్ని ఎండీయూ ఆపరేటర్లకు కూడా కల్పించాల్సిందిగా స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీని వలన రేషన్ పంపిణీకి ఎండీయూ వెళ్లినప్పుడు సరుకులు తీసుకోవడానికి వచ్చే వారి కుటుంబాల్లో ఎవరి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందో వాళ్లు చెబుతారు. దాంతో అక్కడే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి అవుతుందని గుంటూరు జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ తెలిపారు. అధికారికంగా ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఆ వివరాలను తెలియజేస్తామన్నారు.

# పోలీసు, రెవెన్యూ కలిసి పని చేస్తే శాంతి భద్రతలు పరిరక్షించవచ్చు

**- స్పెషల్ ఐజీ చంద్రశేఖర్ - రౌడీషీటర్‌కు రిమాండ్ విధించిన తహసీల్దార్ గోపాలకృష్ణకు పోలీసుల సన్మానం**

తెనాలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌కు మేజిస్ట్రేట్ హోదాలో తహసీల్దార్ రిమాండ్ విధించిన సంఘటనలలో తహసీల్దార్‌ను పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. నేరాల అదుపు కోసం పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేస్తే శాంతి భద్రతలు నెలకొంటాయని స్పెషల్ ఐజి చంద్రశేఖర్ అన్నారు. తెనాలి తహసీల్దార్‌గా పని చేస్తున్న కెవి గోపాలకృష్ణ ఇటీవల ఓ రౌడీషీటర్‌కు 30 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు. తెనాలి వైకుంఠపురానికి చెందిన అన్నం సతీష్ అనే రౌడీషీటర్‌ను పలు దౌర్జన్యకర సంఘటనలు, కొట్లాటకు సంబంధించిన కేసుల్లో వన్ టౌన్ పోలీసులు తహసీల్దార్ ముందు ఇటీవల బైండోవర్ చేశారు. అప్పుడే సంవత్సరం పాటు సత్ప్రవర్తనతో ఉండాలని, ఆ షరతులను ఉల్లంఘిస్తే రూ.2 లక్షలు జరిమానాతో పాటు జైలుకు కూడా పంపుతామని ఒప్పంద పత్రంపై సంతకాలు చేయించి పంపారు. ఇది జరిగిన రెండు నెలలకే ఆ రౌడీషీటర్ మరో యువకుడిని చితకబాది డబ్బులు దోచుకున్న సంఘటనలో వన్ టౌన్ పోలీసులు వారం క్రితం తెనాలి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. దీనికి ముందు రెండుసార్లు అతనికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం, ఆగడాలు ఆపకపోవడంతో తీవ్రంగా పరిగణించిన తహసీల్దార్ మేజిస్ట్రేట్ హోదాలో చట్టం పరిధికి లోబడి అతనికి 30 రోజులు రిమాండ్ విధించారు. అప్పుడే రేపల్లె సబ్‌జైలుకు కూడా తరలించారు. అయితే ఈ సంఘటన పోలీసు, రెవెన్యూ వర్గాలలో చర్చనీయాంశమైంది. తహసీల్దారే నేరుగా రిమాండ్ విధించడం అరుదైన సంఘటన కావడంతో శుక్రవారం గుంటూరులో జరిగిన క్రైం మీటింగ్‌లో తహసీల్దార్ గోపాలకృష్ణను స్పెషల్ ఐజి చంద్రశేఖర్, గుంటూరు ఎస్పి సతీష్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి పని చేయడంతో పాటు ఉన్న అధికారాలను సద్వినియోగం చేస్తే చాలా నేరాలను అదుపు చేయవచ్చని ఐజి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫలితంగా న్యాయ వ్యవస్థపైన ఒత్తిడి తగ్గుతుందని, నేరాలు కూడా చాలా వరకు కట్టడి అవుతాయని పేర్కొన్నారు. ఇదే సంఘటనకు సంబంధించి తెనాలి వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావుకు రూ.25 వేల నగదు బహుమతిని ఎస్పి సతీష్‌కుమార్ అందించారు. నా డ్యూటీని చట్టపరిధిలో ఉన్న నా అధికారాలను అమలు పరిచానని దీని కోసం ప్రత్యేకించి సొంత నిర్ణయాలు తీసుకోలేదని, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) తహసీల్దార్‌లకు కల్పించిన అధికారాలను అందరూ సద్వినియోగం చేస్తే చాలా వరకు నేరస్తులను కట్టడి చేయవచ్చని ఆ పనే నేను చేశానని, దీనికి పోలీసు శాఖ నన్ను సత్కరించడం సంతోషం కలిగించిందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.

# ఉపాధి హామీ పనులపై సమీక్ష

మాచవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4.75 కోట్లు ఉపాధి హామీ పనులు జరిగాయని వీటిలో రూ. 4.56 కోట్లు ఉపాధి కూలీల వేతనం కాగా రూ. 19 లక్షలు మెటీరియల్ పనులు జరిగాయని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంగళరావు అధ్యక్షత వహించగా, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు మాట్లాడుతూ, కొత్తగణేషునిపాడు గ్రామంలోనే అంగన్‌వాడీ కార్యకర్తకు, వేరే గ్రామాల్లో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు, బంధువులకు పూర్తిగా పక్షవాతం వచ్చి మంచంలో ఉన్న వారికి ఇలా రకరకాలుగా పనికి వెళ్ళక పోయినప్పటికీ వారి పేర్లపై స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ వేతనాలు వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై గ్రామంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు డ్వామా పీడీకి రాత పూర్వకంగా అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఏపీడీ ద్వారా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించటం, చెరువులను, కుంటలను అభివృద్ధి పరచడం, కూలీలకు దినసరి వేతనం మూడు వందలు వచ్చే విధంగా స్థానిక అధికారులు పనులు చేయించాలని పీడీ ఆదేశించారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులు సక్రమంగా చేయించి వారికి సక్రమంగా వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగళరావు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్లబల ప్రదర్శనను జయప్రదం చేద్దాం

తెనాలి రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో శనివారం నుంచి ఏప్రిల్ 4 వరకూ జరగనున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఎడ్లబల ప్రదర్శన, పశు పాల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ పాల్గొని ఎడ్లబలప్రదర్శనను, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 40 వార్డుల్లో, గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ నాయకులు

## గుంటూరు మీదగా నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఏప్రిల్, మే నెలల్లో ప్రతీ ఆదివారం నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07201 నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలు ఏప్రిల్ 6వ తేదీ మొదలుకొని మే 25వ తేదీ వరకు ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 2.20కి బయలుదేరి సాయంత్రం 6.25కి గుంటూరు, రాత్రి 7.14కి నరసరావుపేట, సోమవారం ఉదయం 8.55కి యల్హంక, మధ్యాహ్నం 12.45కి అర్సికెరెకు చేరుకొంటుంది. నంబరు. 07202 అర్సికెరె - నరసపూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 7వ తేదీ మొదలుకొని మే 26వ తేదీ వరకు ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.45కి యల్హంక, మంగళవారం ఉదయం 6.24కి నరసరావుపేట, 7.20కి గుంటూరు, మధ్యాహ్నం 1 గంటకు నరసపూర్ చేరుకొంటుందన్నారు.

### గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట - కొండపల్లి మధ్యన మహబూబాబాద్ స్టేషన్‌లో మూడో రైలు మార్గం ప్రీనాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరుమీదగా దారి మళ్లిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. విశాఖపట్టణం - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 22 నుంచి 28వ తేదీ వరకు, షాలిమార్ - హైదరాబాద్ రైలుని మే 27, 28 తేదీల్లో, హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 28,29 తేదీల్లో, సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ రైలుని మే 27,29 తేదీల్లో, భువనేశ్వర్ - సీఎస్‌టీ ముంబై రైలుని మే 27, 28 తేదీల్లో, సాయినగర్ షిర్డి - కాకినాడపోర్టు రైలు మే 27న, కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి, సాయినగర్ షిర్డి- మచిలీపట్నం, షాలిమార్ - సికింద్రాబాద్ రైళ్లు మే 28న, ఎర్నాకుళం - బరౌని రైలు మే 23న పగిడిపల్లి మార్గంలో గుంటూరు మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు.

### వారం పాటు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

నిత్యం గుంటూరు-సికింద్రాబాద్ మధ్యన వరంగల్ మార్గంలో ప్రయాణించే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు కారణంగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరుఇంటర్‌సిటీ రైళ్లు మే23 నుంచి 29 వరకు రద్దు చేస్తున్నామన్నారు.

### జూన్ వరకు కటక్, హైదరాబాద్ రైళ్ల పొడిగింపు

వారంలో ఒక రోజు గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న హైదరాబాద్, కటక్ రైళ్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ నెల చివరి వారం పొడిగిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 07165 హైదరాబాద్ - కటక్ రైలు ప్రతీ మంగళవారం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు, నంబరు. 07166 కటక్ - హైదరాబాద్ రైలు ప్రతీ బుధవారం ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు పొడిగిస్తున్నామన్నారు.

### ఉగాదికి ప్రత్యేక రైళ్లు

ఉగాది పండగకు ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07271 గుంటూరు - ఎస్ఎస్ఎస్ హుబ్లీ ప్రత్యేక రైలు ఈ నెల 31వ తేదీన రాత్రి 8 గంటలకు బయలుదేరి నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్ళారి, తోర్నగల్లు, హోస్పేట, మునిరాబాద్, కొప్పల్, బానాపూర్, బన్ని కొప్ప, గడగ్, అన్నిగేరి మీదగా మరుసటి రోజు ఉదయం 9.20కి హుబ్లీ చేరుకొంటుంది. నంబరు. 07272 హుబ్లీ - గుంటూరు రైలు ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై 2వ తేదీ వేకువజామున 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. ఈ రైళ్లలో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 248.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 258.00 |

## సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్‌గా శోభారాణి



సత్తెనపల్లి రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా మండలంలోని పెద మక్కెన గ్రామానికి చెందిన కోమటినేని శోభారాణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శోభారాణి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావుకు సతీమణి. మహిళా కోటాలో శోభారాణిని ఏఎంసీ చైర్మన్ పీఠం వరించింది. ఏఎంసీ చైర్మన్ పీఠం అధిష్ఠించనున్న తొలి మహిళగా శోభారాణి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలుందిస్తానన్నారు. అనంతరం ఆమెతో పాటు ఆమె భర్త కోమటినేని శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. శోభారాణి ఎంపిక పట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మక్కెపాటి రామచంద్రరావు, దరువూరి నాగేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, టీడీపీ నేతలు లగడపాటి గజానన, కట్టా రమేష్, చలపతిరావు, గంటూరి అజయ్, పచ్చ సుధీర్ హర్షం వ్యక్తం చేశారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

## సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని

కారంపూడి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కారంపూడి పట్టణానికి చెందిన బిక్కం మంగమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.30 వేలు మంజూరయ్యాయి. ఈ నగదు చెక్కును శుక్రవారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో మంగమ్మ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ కారంపూడి పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, ఎస్‌కె మస్తాన్‌వలి, ఎస్‌పీఆర్ కృష్ణ, సాగిన బోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీల్లో డిజిటల్ సేవలు

మాచవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ నుంచి సొసైటీ కార్యాలయాల్లో కూడా డిజిటల్ లావాదేవీలు నిర్వహించనున్నట్లు సొసైటీ సెక్రటరీ గొల్లపల్లి గోపీ తెలిపారు. శుక్రవారం మాచవరం పీఏసీఎస్‌లో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ సేవలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఈ డిజిటల్ సేవలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పర్సన్‌ఇన్‌చార్జ్ కడప శ్రీనివాసరావు, బ్యాంక్ చీఫ్ మేనేజర్ రఫీ, సూపర్‌వైజర్ జక్కుల వెంకయ్య, టీడీపీ నాయకులు పూర్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

## మాచవరం ఉప సర్పంచ్‌గా దయామణి

మాచవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాచవరం ఉప సర్పంచ్‌గా 13వ వార్డుకు చెందిన ఏసుపొంగు దయామణి ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నిక కార్యక్రమానికి 11 మంది వార్డు సభ్యులు హాజరై దయామణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి కే రామమ్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కోటేశ్వరరావు, సర్పంచ్ రాగిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ వెల్లంపల్లికి అనిల్..

పిడుగురాళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): న్యూవెల్లంపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా 6వవార్డు సభ్యుడు గొర్రె అనిల్‌కుమార్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కోరంలేక వాయిదాపడిన ఉపసర్పంచ్ ఎన్నిక శుక్రవారం ఎన్నికల అధికారి నాగచంద్రకుమారి అధ్యక్షతన జరిగిన స మావేశంలో అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

### నేడు ఎమ్మెల్యే యరపతినేని రాక

పిడుగురాళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొననున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు తెలిపారు.

## ఉగాది పురస్కారానికి నసీర్ అహ్మద్

ప్రముఖ చిత్రకారుడు, బహుగ్రంథ రచయిత పిడుగురాళ్లకు చెందిన నసీర్‌అహ్మద్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా ప్రకటించిన కళారత్న పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి మల్లికార్జునరావు నుండి ఆయనకు శుక్రవారం సమాచారం అందింది. ఉగాదిరోజున అమరావతిలో జరిగే పురస్కార వేదికపై సీఎం చంద్రబాబు నుంచి అందుకోనున్నారు.

## ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ

పట్టణ పరిధిలో పెండింగ్‌లో వున్న ఆస్తిపన్ను, నీటిపన్ను బకాయిల వడ్డీపై ప్రభుత్వం 50శాతం రాయితీ కలిపిస్తున్నట్లు కమిషనర్ పి.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నుబకాయిలను వెంటనే చెల్లించి రాయితీని పొందగలరని కమిషనర్ తెలిపారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

సత్తెనపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు శుక్రవారం తెలిపారు. ప్రెసిడెంట్‌గా గంగూరి అజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా చిన్న మణిబాబు, సెక్రటరీగా బయ్యావరపు నరసింహారావు, సబ్‌కోర్టు సెక్రటరీగా షేక్‌జానీ ఖాజావలి, సహాయకార్యదర్శిగా గుజ్జర్లపూడి సురేష్‌బాబు, కోశాధికారిగా బుర్రి సైదయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా తవ్వ హరనాథ్, నిమ్మకాయల నాగులు, లైబ్రేరియన్‌గా ఉల్లం మధుబాబు, లేడీ రిప్రజెంటేటివ్‌గా మహంకాళి కోటేశ్వరమ్మ ఎంపికయ్యారని తెలిపారు.

## సమగ్ర ఆరోగ్య సర్వే

క్రోసూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దొడ్లేరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం అనంతవరంలో సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా క్యాన్సర్ నివారణ పై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి ఉచిత పరీక్షలు నిర్వహించి గుండె జబ్బులు, మధుమేహం, దీర్ఘకాలిక వ్యాధులు, రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ల పై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచర్లకు మహర్దశ

- సమగ్రాభివృద్ధి సాధ్యాసాధ్యాలపై సమాలోచనలు
- తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే జూలకంటి భేటీ



అధికారులతో ల్యాండ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి వడివడి అడుగులు పడుతున్నాయి. మాచర్ల పట్టణం నలుదిశలా అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా ప్రాథమికంగా అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలు, సౌకర్యాలు, ప్రభుత్వరంగ సేవలు, వినోదం, ఆహ్లాదం, క్రీడల వంటి వాటిపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టి సారించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, ప్రజాసేవలకు ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలు, వినోదం, ఆనందం, ఆరోగ్యం కోసం రెండు ఎకరాల్లో గ్రీన్‌గార్డెన్ పార్కు, వాకింగ్‌ట్రాక్, క్రీడలు, క్రీడా స్టేడియం వంటి నూతన నిర్మాణాలు చేపట్టేందుకు ఎమ్మెల్యే సంకల్పించినట్లు తెలుస్తోంది. శుక్రవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో మాచర్ల తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబుతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. మాచర్ల గ్రామ కంఠం రెవెన్యూ ల్యాండ్స్ మ్యాప్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

మాచర్లలోని ప్రభుత్వాసుపత్రిని 100 పడకలుగా ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆరోగ్యమంత్రి సత్యకుమార్, సీఎం చంద్రబాబుకు స్థానిక ఆసుపత్రి అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు అందజేశారు. ఇందుకు అవసరమైన 5 ఎకరాల భూమికోసం ఎమ్మెల్యే సమీక్షించారు. త్వరలో ప్రభుత్వభూమిని సమీకరించి నిర్మాణాలు చేపట్టేదిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. మాచర్ల శివారులో ఎక్కడైనా 10 ఎకరాల ప్రభుత్వ భూమిని సమీకరించి స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అధికారులకు సూచించారు. స్థానికంగా పట్టణ ప్రజలకు 2 ఎకరాల్లో పార్కు నిర్మాణానికి కూడా కావాల్సిన భూమి, మౌళిక వసతుల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌కు సూచించారు.

## సర్వర్ సమస్యతో ఈకేవైసీ ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలో ఈకేవైసీ వేయాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ శుక్రవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తెచ్చారు. సమావేశానికి చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షత వహించారు. సమావేశంలో సుమన్ మాట్లాడుతూ ఈకేవైసీకి ఈనెల 31వ తేదీవరకు మాత్రమే గడువుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మీ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో సచివాలయ ఉద్యోగుల పనితీరు బాగాలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కన్నా స్పందిస్తూ సచివాలయ సిబ్బందితో తక్షణమే సమావేశం ఏర్పాటుచేయాలంటూ మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను ఆదేశించారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు నాయక్, కో-ఆప్షన్ సభ్యురాలు స్వాతి మాట్లాడుతూ తమ వార్డుల్లో కాలువల్లో పూడిక తీయటం లేదని చెప్పారు. శానిటరీ అధికారులు, ఉద్యోగులు పట్టణంలోని పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఎమ్మెల్యే కన్నా ఆదేశించారు. అజెండాలో పొందు పరిచిన వివిధ అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

### టీడీపీ పటిష్టతకు పని చేయాలి

నకరికల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టంగా బలపడేందుకు పార్టీలోని అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు కలసి పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం నకరికల్లు టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వం పొందిన సభ్యులకు టీడీపీ గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదులో కీలకంగా వ్యవహరించిన పిల్లల యూసఫ్‌కు రూ 25వేలు చెక్కును అందించి సన్మానించారు. అనంతర ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, కనుమూరి జాజీ చౌదరి, షేక్ అలీ బాషా, తిరుమలశెట్టి వెంకటరావు, పూజల వెంకట కోటయ్య, జే వీరాంజనేయులు, సాగి శ్రీను, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలి

రాజుపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే పంటలను సాగుచేస్తూ అంతర పంటలను వేయటం ద్వారా భూమికి సూక్ష్మ పోషకాలు వృద్ధిచెంది భూమి సారవంతమవుతుందని యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబునాయక్, వీపీఏ జెర్సీ నరసింహరావు, వీవోఏలు రాణి, బాలమ్మబాయ్, శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

## ఫిర్యాదిదారుల ఇళ్లకు అధికారులు

రాజుపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, తహసీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంపీడీవో సత్యానారాయణ తదితర యంత్రాంగం నేరుగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సమస్యలను పరిష్కారించే దిశగా ప్రయత్నం చేశారు. రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ పొత్తూరి శ్రీనివాసమూర్తి గ్రామంలో ఉపాధి పథకంలో అవినీతి జరిగిందని టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటిలో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదుచేశాడు. చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన తిరుమల శ్రీనివాసరావు తనకు పూర్వీకుల నుండి సంక్రమించిన పొలంలో రెండుసెంట్లు తక్కువగా ఉందని సర్వేచేసి తనకు అప్పగించాలని అర్జీ ఇచ్చాడు. ఒకరి సమస్యను పరిష్కరించారు. మరొకరిది త్వరంలో చేస్తామని హామీ ఇచ్చారు.

### హోంగార్డు బాబు మృతి

నకరికల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నకరికల్లు పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న షేక్ బాబు శుక్రవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. బాబు మృతిపట్ల ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది సంతాపాన్ని తెలిపారు.

## పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి

గురజాలటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి సంగం డెయిరీ కృషిచేస్తోందని సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాత అంబాపురం సొసైటీలో పాల ఉత్పత్తిదారులు ఇరువురు మృతిచెందగా మట్టిఖర్చుల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం శుక్రవారం మృతుల కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో పాత అంబాపురం ఇన్‌చార్జి అంజిరెడ్డి, మేనేజర్ డాక్టర్ ఎన్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ఉప సర్పంచ్‌గా ధనలక్ష్మి

దుర్గి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామ ఉప సర్పంచ్‌గా బండ్ల ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి బండ్ల ధనలక్ష్మి ఒక్కరే నామినేషన్ వేయడంతో ధనలక్ష్మిని ఉపసర్పంచ్‌గా ఎన్నికల అధికారి పి హనుమంతరావు ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అయోధ్యస్వామి ఆశ్రమంలో రుద్రాభిషేకం

పెదకూరపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో శుక్రవారం మహాన్యాస రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

## వీరారెడ్డికి ఎమ్మెల్యే ప్రవీణ్ సంతాపం

రాజుపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన వెన్నా వీరారెడ్డి ఇటీవల మృతి చెందారు. శుక్రవారం గణపవరం గ్రామంలో నిర్వహించిన వీరారెడ్డి దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివరెడ్డితో కలిసి వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. మృతుడు వీరారెడ్డి వెన్నా సాంబశివరెడ్డి సోదరుడు. ఆయన వెంట మన్నెం శివనాగమల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ మద్ది వెంకట్రామిరెడ్డి, నూర్‌బాషా సంఘ పెద్దలు వలిబాయ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, హసన్, వెన్నా సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు అసుల జగన్, సముద్రం, ఓర్సు ఏడుకొండలు, కొర్రకోలు వెంకయ్య, అక్కల వెంకట్రామిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, నెల్లూరి రామారావు, నల్లమోతులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

## గురజాల నగర పంచాయతీ బడ్జెట్ ఆమోదం

గురజాలటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్, సాధారణ సమావేశం ఇన్‌చార్జి చైర్మన్ షేక్ బడేజాని అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2025-26 సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదించారు. రూ. 3,75,06,500 రాబడిని అంచనా వేయగా రూ.2,87,08,000 ఖర్చుగా అంచనా వేశారు. తాగునీటి అవసరాలకు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పించారు. పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టేందుకు కూడా నిధులు కేటాయించారు. సమావేశంలో కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ వరలక్ష్మి బొల్లయ్య, ఏఈ మహ్మద్ ఖాసీం, టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## 30న రెజ్లింగ్ పోటీలు

అచ్చంపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకుల కళాశాలలో బాలబాలికల జిల్లా రెజ్లింగ్ పోటీలు జరుగుతాయని పల్నాడు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15, 20 బాలబాలికల కుస్తీపోటీలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. అండర్ - 15లో పాల్గొనేవారు 2010, 11, 12లో పుట్టినవారు అర్హులని, 2012లో పుట్టిన వారు మెడికల్ సర్టిఫికెట్ తీసుకొనిరావాలన్నారు. అండర్-20లో పాల్గొనేవారు 2005, 06, 07, 08 పుట్టినవారు అర్హులని, 2008లో పుట్టిన వారు మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. ఎంపికలో పాల్గొనేవారు ఒరిజనల్ ఆధార్ తీసుకురావాలని కోరారు. ఎంపికైనవారు ఏప్రిల్ 4, 5 తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### మునగోడులో ఇఫ్తార్

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఎత్తిపోతల పథకం చైర్మన్ షేక్ ఖాజాబి షరీఫ్ ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. స్థానిక మసీద్‌లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.

## జమ్మలమడక ఉప సర్పంచ్‌గా కొండా పెద అక్కయ్య

మాచర్ల రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం జమ్మలమడక ఉపసర్పంచ్‌గా కొండా పెదఅక్కయ్య ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికలో పెద అక్కయ్యను ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు పెద అక్కయ్యకు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

## వీఆర్‌ఏల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 5న విజయవాడలో జరిగే గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సుకు మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొని విజయవంతం చేయాలని సంఘ అధ్యక్షుడు రాజు తెలిపారు. శుక్రవారం అమరావతిలో జరిగిన వీఆర్‌ఏల సమావేశంలో పల్నాడు జిల్లా సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందర సాహెబ్, సీఐటీయూ మండల కార్యదర్శి బీ సూరిబాబు ముఖ్యఅతిధిలుగా వీఆర్‌ఏల సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## మండెపూడిలో మోటర్లు అపహరణ

మండలంలోని మండెపూడి గ్రామంలోని మంచినీటి బావికి అమర్చిన 1హెచ్‌పీ మోటర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామస్తులు నీటిని పట్టుకునేందుకు పంచాయతీవారు మోటర్లను ఏర్పాటుశారు. రెండురోజుల క్రితం రూ.15వేల విలువైన మోటరును అపహరించుకుపోవడంతో పంచాయతీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్రవారం నాటికి 521.60 అడుగులు ఉంది. ఇది 152.21టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 6041, ఎడమకాల్వ ద్వారా 7353, ప్రధాన జలవిద్యుత్‌కేంద్రం ద్వారా 11,995, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లోగా 27,489 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## పంచ ప్రాధాన్యతలపై దృష్టి సారించండి

అచ్చంపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పంచ ప్రాధాన్యతలపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని పొలాల్లో 300 ఫారం పాండ్ల పనులు ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, జేఈ రమణమూర్తి, టీఏ రాజవర్ధన్, ఎం శే షారావు, ఎస్ జయరాజు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ ఏపీవోగా దేవరకొండ

క్రోసూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన మాజీ ఉపాధ్యాయుడు దేవరకొండ కృష్ణ ట్రైబల్‌వెల్ఫేర్ ఏపీవోగా నియమితులయ్యారు. నెల్లూరు ఐటీడీఏ ఏపీవోగా ఆయనను నియమిస్తూ ఐటీడీఏ డైరెక్టర్ ఎస్ భార్గవి ఉత్తర్వులు జారీచేశారు. మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆయన అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవోగా, ఇప్పుడు ఐటీడీఏ ఏపీవోగా నియమితులయ్యారు.

## పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ అధికారులు

పెదకూరపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని 75 తాళ్ళూరు పీహెచ్‌సీని జాతీయ అధికారులు శుక్రవారం సందర్శించారు. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు, నైపుణ్యాల గురించి ఆరోగ్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. జాతీయ అధికారులు డాక్టర్ ఏఎన్ పరిమళ జగన్, డాక్టర్ భద్రుకంఠ శర్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెలుగొండారెడ్డి, డాక్టర్ ఆదిత్య పాల్గొన్నారు.

## టీటీడీ పంచాంగ పఠనకర్తగా ఫణికుమార్‌శర్మ

బెల్లంకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో జరిగే ఉగాది వేడుకల్లో పంచాంగ పఠనకర్తగా పల్నాడు జిల్లా బెల్లంకొండ గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ శుక్రవారం ఆహ్వానం అందుకున్నారు. ఈనెల 30వ తేదీ ఉదయం తిరుపతి మహంతి ఆడిటోరియంలో జరిగే ఉగాది వేడుకల్లో పంచాంగ పఠనం చేస్తారు.

## మార్చి లోగా 14వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేయాలి

- డీపీవో విజయభాస్కర్‌రెడ్డి

పిడుగురాళ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో 14వ ఆర్థిక సంఘం నిధులను మార్చి నెలాఖరులోగా ఖర్చుచేయాలని లేకుంటే వెనక్కి వెళ్లే అవకాశం వుందని డీపీవో విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఆస్తిపన్ను వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ప్రభుత్వఆస్తులను భద్రపరచాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రరావు, ఈవోపీఆర్డీ దయాకర్, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం పీడీ సిద్ధ లింగమూర్తి తదితరులు

## అన్నీ తప్పులేనా !

- గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ చేయూత
- పథకానికి కొందరి వల్లనే చెడ్డపేరు

పిడుగురాళ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని కొందరు పథకానికి తూట్లు పొడుస్తున్నారని పల్నాడు జిల్లా జాతీయ ఉపాధిహామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి అన్నారు. శుక్రవారం పిడుగురాళ్ల ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయం వద్ద పబ్లిక్ హియరింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల నివేదికలను ఎస్‌ఆర్‌పీ, జీఆర్‌పీ సభ్యులు వివరించారు. ఉపాధి పథకం సమయంలో ఎటువంటి వసతులు కల్పించడం లేదని, మస్టర్లలో కొట్టివేతలు, కొందరినే పనికి పిలుస్తున్నట్లు గ్రామసభల ద్వారా ఫిర్యాదులు అందాయని సభ్యులు వివరించారు. మొత్తం రూ.7కోట్ల 78లక్షల 70వేల 959 పైగా ఉపాధిపనులు జరిగాయన్నారు. ఆయా పనులలో అన్ని గ్రామాలలోను పాత, ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్లపై పలు ఫిర్యాదులు అందాయని, అలా వస్తే సహించేది లేదని ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు, ఏపీడీ మల్లికార్జునరావు, ఎస్‌ఆర్‌పీ జేఎస్ రాజు, ప్రభాకర్, అసిస్టెంట్ డీవో సునీత, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, ఏపీవో మేరీ గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం

రెంటచింతల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన వివాహితుడైన కామనబోయిన బ్రహ్మం (24) అదృశ్యమయ్యాడు. 15 రోజుల క్రితం తన కుమార్తె మృతిచెందడంతో మనోవేదనకు గురయ్యాడు. తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 30.05 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రోసూరు ఏడీఏ హనుమంతరావు

## ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

అచ్చంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని వ్యవసాయ అనుబంధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏపీఎం సలీం, ప్రకృతివ్యవసాయ రాష్ట్రసిబ్బంది ఉషారాణి పాల్గొన్నారు.

● క్రోసూరు: రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించాలని ఏడీఏ హనుమంతరావు అన్నారు. క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని అచ్చంపేటలో వ్యవసాయ, అనుబంధ శాఖల, సెర్ప్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

# వన్యప్రాణులు.. కనువిందు



నీళ్లు తాగుతున్న చుక్కల జింకలు

వినుకొండటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండ సమీపంలోని కంఢ్రిక బీటు అటవీ ప్రాంతంలో జంతువులు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధంగా ఉన్న నీటి కుంట వద్ద దర్శనమిస్తున్న అడవి జంతువులను చూస్తే ఆశ్చర్యం కలిగించక మానదు. అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వో 20 రోజుల క్రితం కంఢ్రిక బీట్‌లోని నీటి కుంటల వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. 27న సీసీ ఫుటేజీలను పరిశీలించిన అధికారులకు, కణితి, మనబోతు, చుక్కల దుప్పులు, అడవి పందులు, అడవి కుక్కలు, నెమళ్లతో పాటు వివిధ రకాల పక్షుల వీడియోలు రికార్డు అయ్యాయి.



పురివిప్పి నాట్యమాడుతున్న నెమలి



మనబోతుతో ఉన్న పిల్లలు





రేస్ కుక్క

## పేలుళ్ళ ధాటికి.. ఇళ్ళు కూలుతున్నాయ్

**దుమ్ముతో పంట పాడవుతోంది.. సిమెంటు కంపెనీలపై ప్రజల ఆగ్రహం**



మిరప కాయల పై పడిన దుమ్మును పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, ఇతర అధికారులు

దాచేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్టరీకి భూములు ఇస్తే మీ పిల్లలకు ఉద్యోగాలొస్తాయి...మీ గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది...వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం...తాగు నీటి సమస్య లేకుండా చూస్తాం...అంటూ ప్రజాభిప్రాయ సేకరణలో ఫ్యాక్టరీ యజమానులు అధికారుల ఎదుట గ్రామస్తులకు హామీలు ఇచ్చారు. తీరా ఫ్యాక్టరీ నిర్మాణాలు పూర్తి చేసుకొని ఉత్పత్తులు ప్రారంభించారు. కాని మా పిల్లల ఉద్యోగాల మాట దేవుడెరుగు, మాకు పట్టెడన్నం పెట్టే పంట పొలాలు సిమెంట్ ఫ్యాక్టరీ దుమ్ముధూళితో దెబ్బతింటున్నాయి. మాకు నిలువ నీడనిచ్చే ఇళ్ళు నేల మట్టమయ్యే పరిస్థితి వచ్చింది. మా పంట పొలాలకు సాగు నీరు అందించే కాలువలను పూడ్చి వేశారు. ఇదేమిటని? అడిగితే మా ప్రశ్నలకు బదులు ఇచ్చే వారే కరువయ్యారంటూ తమ గ్రామాలకు వచ్చిన అధికారులకు ప్రజలు గోడు వెళ్ళబుచ్చుకున్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడు సిమెంట్స్, తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను అధికారులు పరిశీలించారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో హౌసింగ్, మైనింగ్, నీటి పారుదల శాఖ, మైనర్ ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, దేవాదాయ శాఖ, మరికొన్ని ఇతర శాఖలతో కలిపి 11 శాఖల అధికారులు తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు, తంగెడ గ్రామాల్లోని రైతులను, బ్లాస్టింగ్‌తో ఇళ్ళు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను నేరుగా కలసి వారి కష్టాలను విన్నారు. రైతులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము పంట పొలాల పై పడటంతో చెట్లు ఎదుగుదల తగ్గటం, పండిన కాయల పై దుమ్ము పేరక పోయి నాణ్య లేక పోవటం, నాణ్యత లేని పంటకు ధర లేక పోవటం, తమను ఆర్థికంగా కుంగ దీస్తుందన్నారు. ఇది చాలదన్నంటూ పెద్ద మొత్తంలో పేలుళ్ళు జరపటంతో నివాస గృహాల గోడలు పగుళ్ళిచ్చి స్లాబులు దెబ్బతిని ఇళ్ళు కూలిపోయే పరిస్థితి ఉందని కోరంపల్లి ధనలక్ష్మి, షేక్ గుంటూరు, సోయ యలమందమ్మ, సిద్దాబత్తుల శ్రీను ఆర్డీవోకు కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. గత మూడు సంవత్సరాలుగా తాము పడుతున్న బాధలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, ఎంపీ కృష్ణ దేవరాయలకు తెలియ జేశామని తెలిపారు. అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని మా వంక చూసిన దాఖలాలు లేవని తెలిపారు. ఫ్యాక్టరీలకు భూములు ఇవ్వటమే మేము చేసిన నేరమా? అంటూ వారు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోయినా పర్వాలేదు గాని మాకు నీడనిచ్చే ఇళ్ళను, మాకు పట్టెడన్నం పెట్టే పొలాలను నాశనం చేయవద్దని వారు వేడుకున్నారు. అనంతరం నీటి పారుదల శాఖకు చెందిన కాలువలు ఆక్రమించటం, తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీకి గత ఐదు సంవత్సరాలుగా రూ 70 లక్షలు పన్నులు చెల్లించక పోవటం, అనుమతులు లేకుండా క్రషర్ నిర్మాణం, స్టాకర్ షెడ్డు నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాలను క్షేత్ర స్థాయిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను నమోదు చేశామని, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మైనింగ్ ఏడీ ప్రకాష్ కుమార్, హౌసింగ్ ఈఈ బాలాజీ నాయక్, మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ డీఈ పసుపులేటి ఆదినారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు, దేవాదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, సీఐ భాస్కరరావు, ఎస్ఐ సౌదర్ రాజన్, టీడీపీ నేతలు పురంశెట్టి పరంజ్యోతి, రామారావు, జనసేన నేతలు అంబటి మల్లి, బూసి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి అంకారావు, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ పాముల కిషోర్, ఆవుల శివకృష్ణ, కిష్టంశెట్టి పకీరయ్య, ఉలిబండ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



పెదగార్లపాడు గ్రామంలో భారీ బ్లాస్టింగ్‌కు పగుళ్ళిచ్చిన ఇంటి గోడలను పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు

# కొత్త చరిత్రకు వేదిక



వెలగపూడిలో ముస్తాబైన సభాప్రాంగణం

- పేదరిక నిర్మూలనకు వినూత్నంగా పీ4 కార్యక్రమం
- రాష్ట్రంలోని పేదలకు సంపన్నుల చేయూత
- ఇరువురికి మధ్య అనుసంధానంగా ప్రభుత్వం
- ఉగాది వేడుకల్లోనే పీ4కు సీఎం శ్రీకారం
- వెలగపూడిలో కొలిక్కి వచ్చిన సభ ఏర్పాట్లు
- 11 వేల మందికిపైగా కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలకు రాజధాని ప్రాంతంలోని వెలగపూడి ముస్తాబైంది. ఈ వేడుకలకు తోడు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే సరికొత్త విధానం పీ4కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ రెండింటిని కలిపి ఒకే ఉత్సవంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి 2047 నాటికి స్వర్ణాంధ్రను సాకారం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి రూపకల్పన చేశారు. రాష్ట్ర సామాజిక గతిని మలుపుతిప్పే ఈ చరిత్రాత్మక కార్యక్రమాన్ని ఆదివారం సీఎం ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని అమలుచేయనున్నారు. ఈ విధానంలో ప్రభుత్వం ప్రత్యేకంగా పేదవారికి ఎలాంటి రుణాలు, నిధులు ఇవ్వదు. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సంపన్న కుటుంబాలు రాష్ట్రంలో వెనుకబడిఉన్న పేద కుటుంబాలను ఆదుకొనేలాగా, తద్వారా సామాజికంగా మార్పు తీసుకొచ్చేలాగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇందులో దాతలను మార్గదర్శులుగా, లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా పిలుస్తారు. ఈ ఇరువురి మధ్య ప్రభుత్వం ఓ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. దీనికోసం పీ4 సొసైటీలను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేస్తారు. పేదరికం లేని రాష్ట్రం కోసం ఇదో విప్లవాత్మకమైన ముందడుగు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ విధానం దేశానికే ఓ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రత్యేకంగా వేదిక ముస్తాబు

వెలగపూడిలోని సెక్రటేరియెట్ వెనుకవైపు ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ప్రాంగణంలో ఉగాది, పీ4 కార్యక్రమం ప్రారంభ వేడుకలను 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకల్లా ప్రాంగణం వద్దకు చేరుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు ప్రాంగణంలో రెండు షెడ్లు నిర్మించారు. ప్రధానమైన షెడ్డులో 11 వేలమందికిపైగా కూర్చొని కార్యక్రమాలను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమీప జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఏడు వేలమందిని, సుదూర జిల్లాల నుంచి సుమారు 5 వేలమందిని తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దగ్గరి ప్రాంతం వారికి కూడా అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. సభా ప్రాంగణంలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు.





## బాపట్ల-చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రం
- పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్



అడవిపల్లెపాలెంలో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రమాణాలతో సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బాపట్ల మండలం అడవిపల్లెపాలెం వీ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌పార్క్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్లూఫాగ్‌బీచ్‌గా సూర్యలంక బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. పర్యాటకుల భద్రత, అంతర్జాతీయప్రమాణాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. బాపట్ల-చీరాల మధ్యలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 ద్వారా మంజూరైన 97.52 కోట్ల రూపాయల నిధులతో సూర్యలంకబీచ్‌లో అధునాతన సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే పీపీపీ విధానంలో పెట్టుబడులకు పలువురు ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికామన్నారు. పీపీపీ విధానంలో వీ రిసార్ట్స్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు.

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటకరంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందుకు నిదర్శనంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సూర్యలంకబీచ్‌కు 97కోట్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ నిధులతో సూర్యలంకబీచ్‌లో పర్యావరణ విద్య, పరిశుభ్రత, టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదులు, వ్యర్థాల నిర్వాహణకు విధానం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకానికి పెద్దపీట వేస్తామన్నారు. తద్వారా బాపట్ల-చీరాల నియోజకవర్గాలలో భారీఎత్తున ఉపాధి కల్పించనున్నామన్నారు. పర్యాటక రంగానికి ఈ ప్రాంతాలు ఉపయోగపడేవని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో బాపట్ల,చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండలు తెలిపినట్లు చెప్పారు. వాళ్ళఅడిగిన 15రోజుల్లోనే సూర్యలంకబీచ్ అభివృద్ధికి భారీఎత్తున నిధులు రావటం జరిగిందన్నారు. ఇందుకు కేంద్రగ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇతోధికంగా కృషి చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య, బాపట్లఅర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, జనసేన సీనియర్ నాయకులు అమంచి స్వాములు, నామన వెంకటశివన్నారాయణ, వీ రిసార్ట్స్ అధినేత సందీప్, భాస్కర్ పాల్గొన్నారు.

## రేపు సాహితీ వసంతోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని సాహితీ సమైక్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30న ఆదివారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు సమైఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవి, గజల్ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం, ప్రముఖ సినీ నటుడు కేదార్‌శంకరకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాంగ శ్రవణం, విష్ణు సహస్రనామ పారాయణం, సాహితీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టీ కృష్ణబాబు,కమిషనర్ శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామచంద్ర రాజు, సమైఖ్య కార్యదర్శి రాము పాల్గొన్నారు.

## బెల్ సరే.. మరి నీళ్ళెలా..?

(3వ పేజీ తరువాయి)

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసరమైన నీటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

**రూ.లక్షలతో ఏర్పాటు.. ఫలితం శూన్యం**

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50,000 లీటర్లు లక్ష, 2 లక్షలు లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకు వచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేశారు. మరి కొన్ని చోట్ల నిర్వహణా లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం తాజాగా ఆర్వో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలల్లో మాత్రం పరిస్థితి షరామామూలుగానే ఉంది.





రేపల్లె 3వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో పనిచెయ్యని ఆర్‌వోప్లాంట్, పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో ఇంటి నుండి బాటిల్స్ తెచ్చుకుంటున్న బాలికలు

# ఆర్-5 జోన్ లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు

**గుంటూరులో 216 ఎకరాలు**

**ఎన్టీఆర్ జిల్లాలో 80 ఎకరాలు గుర్తింపు**

**7056 మంది అనర్హుల గుర్తింపు**



గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఆర్5 జోన్ ఒకటి ఏర్పాటు చేసి లబ్ధిదారులు, భూములు ఇచ్చిన రైతుల మధ్యన వైసీపీ కుంపటి పెట్టగా ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధమైంది. తాము అధికారంలోకి రాగానే ఆర్5 జోన్‌ని రద్దు చేయడంతో పాటు లబ్ధిదారులకు స్థానికంగా నివాసం ఉంటున్న సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రతిపక్షంలో ఉండగా సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆ మేరకు గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లను భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇప్పటికే గుంటూరు జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అవసరమైన భూములను గుర్తించారు. ఎన్‌టీఆర్ జిల్లాలోనే పెండింగ్‌లో ఉండటంతో తక్షణమే ఇళ్ల స్థలాలకు అవసరమైన భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానికి వెలుపల ఉన్న నియోజకవర్గాల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలను ఎంపిక చేశారు. అయితే వాళ్లకి స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించి రాజధానిలో వేర్వేరు గ్రామాల్లో సెంటు భూములను ఇచ్చేందుకు ఆర్5 జోన్‌ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం వెంకటపాలెంలో సభ కూడా నిర్వహించారు. ఆగమేఘాలపై లేఅవుట్ల అభివృద్ధి పేరుతో రూ. వందల కోట్లు ఖర్చు చేశారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు కూడా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే దీనిని కోర్టులు నిలిపేశాయి. ఎన్‌టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అలానే గుంటూరులో 23,761 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి హడావిడిగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన ఈ కుట్రని అప్పట్లోనే రాజధానికి భూములు ఇచ్చిన రైతులు వ్యతిరేకించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది.

టీడీపీ ప్రభుత్వం గత ఏడాది అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 50,792 మంది లబ్ధిదారుల అర్హతలను పునర్‌పరిశీలన చేయించింది. గుంటూరులో 23,761 మందిలో 4,323(11 డ్యూప్లికేట్‌లు కలిపి) అనర్హులుగా తేల్చారు. ఎన్‌టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులకు 3,183 మంది అనర్హులుగా నిర్ధారించారు. అనర్హుల పేర్లను తొలగించిన తర్వాత ఎన్‌టీఆర్ జిల్లాలోని 23,848 మంది లబ్ధిదారులకు 265 ఎకరాల భూమి అవసరం అవుతుందని లెక్కించారు. అలానే గుంటూరు జిల్లాలో అనర్హుల ఏరివేత అనంతరం 19,438 మందికి 216 ఎకరాల భూమి అవసరమని నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే గుంటూరు జిల్లాలో లబ్ధిదారులకు అవసరమైన భూములను వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే గుర్తించారు. ఎన్‌టీ ఆర్ జిల్లాలో 265 ఎకరాలకు కేవలం 80 ఎకరాలు మాత్రమే గుర్తించారు. ఇంకా 185 ఎకరాలు ఎన్‌టీఆర్ జిల్లాలో గుర్తించాల్సి ఉన్నది. గుర్తించిన భూములను త్వరలోనే సేకరించి లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## సైన్స్ పరీక్షకు 98.70 శాతం హాజరు

● డీఈవో చంద్రకళ

నరసరరావపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బయాలజీ సైన్ పదో తరగతి పరీక్షకు పల్నాడు జిల్లావ్యాప్తంగా 98.70 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాలలో రెగ్యులర్ 25,690 విద్యార్థులకు 25,347 విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రైవేట్ విద్యార్థులు 376మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి పరీక్షలు మార్చి 2025కు జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలలో 1130 మంది విద్యార్థులకు 980మంది విద్యార్థులు 86.77శాతం హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు.

## రైలు నుంచి జారి పడి యువకుడికి తీవ్ర గాయాలు



ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

వినుకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైల్ నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలం లోని విఠంరాజుపల్లి సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గుంటూరు నుంచి దొనకొండ వైపు వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి తలకు తీవ్ర గాయాలై అపరస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108సిబ్బంది సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుని వద్ద ఏవిధమైన ఆధారాలు లభించలేదు. వినుకొండ పోలీసులకు సమాచారం అందించారు.

## లారీ, కారు ఢీ.. నలుగురికి గాయాలు

ఈపూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లారీ, కారు ఢీకొని నలుగురు గాయపడిన సంఘటన వెంకటరెడ్డిపురం సమీపంలోని కనుమ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన అనంతయ్య, తాతయ్య, చెన్నకేశవులు, అనీల్‌లు దుర్గి మండలం అడిగొప్పలలోని అమ్మవారిని దర్శించుకొని కారులో వస్తున్నారు. కనుమ వద్ద కారంపూడి వైపు వెళ్తున్న లారీ, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేశారు. సంఘటనా స్థలాన్ని ఈపూరు ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు పరిశీలించారు.

## రుణమేళాకు 227మంది హాజరు

వినుకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుట్టారెడ్డి ఆధ్వర్యంలో రుణమేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వినుకొండ మండల పరిధిలో మొత్తం కాపులకు17, ఈబీసీ-1, కమ్మ-5, రెడ్డి-2, వైశ్య-1, బ్రాహ్మణ-1, బీసీ-20 మొత్తం 47 యూనిట్లకు గాను దరఖాస్తు చేసుకున్న 227 మంది అభ్యర్థులకు కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్ (ఏడీబీ) అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి కేటాయించిన యూనిట్లు పరిశీలించిన ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రుణాల కోసం ఎక్కువమంది పోటీ పడుతున్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రుణమేళాలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్యాంక్ అధికారులు రుణమేళా కార్యక్రమంలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మాధ్యూబాబు, పంచాయతీ కార్యదర్శులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● బొల్లాపల్లి: స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్పొరేషన్‌లకు రుణమేళా నిర్వహించారు. ఈ క్యాంపులో మండలంలోని 42 యూనిట్లకు 135మంది హాజరైనట్లు ఎంపీడీవో పీ సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేష్, ధనలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తురుమెళ్ళ ఉప సర్పంచ్‌గా పెద బాలనాగేశ్వరరావు

రొంపిచర్ల, మార్చి 28 (ఆంధ్రజోతి): మండలంలోని తురుమెళ్ళ గ్రామ ఉప సర్పంచ్‌గా పాలెపోగు పెద బాలనాగేశ్వరరావు శుక్రవారం ఎంపికయ్యారు. ఈ నెల 27వ తేదీన జరగాల్సిన ఉప సర్పంచ్ ఎన్నిక కోరంలేక వాయిదా పడింది. ఏడుగురు సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా వెంకట లక్ష్మీకుమారి వ్యవహరించారు. ధ్రువీకరణ పత్రాన్ని బాల నాగేశ్వరరావుకు అందజేశారు. ఆరు పంచాయతీల్లో నలుగురు ఉప సర్పంచ్‌లు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

వినుకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్‌లో తహసీల్దార్ సురేష్ చేతుల మీదుగా నిరుపేద ముస్లింలకు శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం రంజాన్ ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో నాగూర్, ముస్లింలు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఆర్ హ్యాక్ మేనియా 2కే25

నరసరావుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇజనీరింగ్ కళాశాలలో ఏఎంఆర్ హ్యాక్‌మేనియా 2కే25 సాంకేతిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రో ఐటీ సొల్యూషన్స్ ఫౌండర్ సీహెచ్ శ్రీరామ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నరసరావుపేట మండలంలోని వివిధ కళాశాల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రోజు 60కి పైగా టీమ్స్ రెండో రౌండ్‌కు ఎంపికయ్యాయి. లియో గ్లోబల్ ఓవర్సీస్, కేసీ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్, చతుర్ముఖి కన్సల్‌టెన్సీ ఈకో ఓవర్‌సీస్ స్పాన్సర్లుగా వ్యవహరించారు. విజేతలను రెండోరోజు శనివారం ప్రకటిస్తానని ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ చెప్పారు.

## ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
● గుంతలు పూడ్చాలని ప్రయాణికుల వినతి



ప్రమాదాలకు నెలవుగా మారిన తలార్లపల్లి - మారెళ్ళవారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు

నూజెండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మార్జిన్‌లు గోతుల మయంగా ఉండటంతో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులు తమ భూములకు నీటి పైపులైన్‌లు వేసుకొనేందుకు కాలువలు తీయటం, మొబైల్ నెట్‌వర్క్ టవర్లకు కేబుల్ వేసే సమయంలో తీసిన గోతులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ముఖ్యంగా వినుకొండ - ఈదర మార్గంలో మారెళ్ళవారిపాలెం సమీపంలో రోడ్డు పక్కన మార్జిన్‌లు పొక్లెయిన్‌తో తీసిన గుంతలు నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహన చోదకులు భయపడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల మార్జిన్‌లలో ఉన్న గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

## ప్రజలకు సత్వర న్యాయం అందించాలి

భూ సమస్యలపై జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



భూ సమస్యలపై అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భూ రక్ష, భూ సర్వే పేరుతో గత ప్రభుత్వం నిర్వహించిన భూముల సర్వే ప్రక్రియ లోపభూయిష్టంగా సాగిందని, సర్వే నంబర్లు, రైతుల వివరాలు, భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలలో ఖచ్చితత్వం లేకుండా పోయిందని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా, భూముల సర్వే నిర్వహించిందని, రైతుల హక్కు పత్రాల్లో తప్పులు, విస్తీర్ణం తగ్గడం, పేర్లు మారడం వంటి అనేక సమస్యలు తలెత్తాయన్నారు. ఇప్పటికీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల సమాచారం సరిగాలేదని, కొన్నిచోట్ల ఆన్‌లైన్లో వివరాలు కూడా కనిపించడం లేదన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని భూ యజమానులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. రెవెన్యూ సిబ్బంది తక్షణమే భూ ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు, పొరపాట్లు కూటమి ప్రభుత్వం వచ్చాక సరిదిద్దుతున్నదన్నారు. సమీక్షా సమావేశంలో తహసీల్దార్ హుస్సేన్, ఆర్‌ఐ రమీజా, సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత కార్యాలయంలో సిబ్బంది ఏర్పాటు చేసిన మంచి నీటి, మజ్జిగ చలివేంద్రాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన నాయకులు తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కందుల రమణ పాల్గొన్నారు.

## వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

● అజ్ఞాతంలోకి ఎంపీటీసీలు
● కేవలం నలుగురు సభ్యులు మాత్రమే హాజరు

నరసరావుపేట రూరల్, మార్చి 28 (నరసరావుపేట రూరల్): మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ ఎన్నిక శుక్రవారం క్షణం క్షణం ఉత్కంఠగా సాగింది. నరసరావుపేట మండలంలో 17మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారిలో పమిడిపాడు-1, పమిడిపాడు-2, ములకలూరు, బసికాపురం ఎంపీటీసీ సభ్యులు మాత్రమే వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం హాజరయ్యారు. మిగిలిన 13మంది హాజరు కాకపోవడంతో శుక్రవారం కూడా వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐ మురళి తెలిపారు. నరసరావుపేట మండలంలోని ఎంపీటీసీ సభ్యులు వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం హాజరు కాకుండా అజ్ఞాతంలోకి వెళ్ళారు. గత రెండు రోజులుగా ఎంపీటీసీ సభ్యులను ఇతర ప్రాంతాలకు తరలించారు. వైస్ ఎంపీపీ ఎన్నిక కాకుండా ఎంపీటీసీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అజ్ఞాతంలోకి తీసుకెళ్ళారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. ఎన్నికలను ఎదుర్కొనలేకనే మాజీ ఎమ్మెల్యే ఇటువంటి అరాచకాలకు తెరలేపారని ఆరోపించారు.

## ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి: తహసీల్దార్ విజయశ్రీ



ఈ కేవైసీని పరిశీలిస్తున్న తహసీల్దార్

యడ్లపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈ కేవైసీ నమోదు కాని రేషన్ కార్డుదారులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన యడ్లపాడులో జరుగుతున్న ఈ కేవైసీ నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ కేవైసీ నమోదు కాని లబ్ధిదారుల వివరాలు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోల వద్ద ఉన్నాయని, వారిని సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే నమోదుకాని వారికి సమాచారం కూడా అందించడం జరిగిందన్నారు. ఈ కేవైసీ నమోదు కాకపోతే రేషన్ పంపిణీ నిలిపివేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ గమనించి నమోదు చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట డీటీ అనూరాధ, వీఆర్వో చారి తదితరులు ఉన్నారు.

## ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నాతాని

నరసరావుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఎన్నికలలో ఉపాధ్యక్షుడిగా నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కే-రిడ్జి ప్రిన్సిపాల్ బర్నబాస్, ఉపాధ్యాయులు నాతాని వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లపై వాగ్దానాలు అమలు చేయాలి: సీపీఎం

చిలకలూరిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్మార్టు మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్టు మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టాలని యువగళం పాదయాత్రలో వ్యాఖ్యానించిన మంత్రి నారా లోకేశ్ వ్యవసాయ మోటార్లతో పాటు వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నా నోరు మెదపడం లేదని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట అదనపు బాదుడుకు వ్యతిరేకంగా సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అదనపు భారాలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ ఏడుకొండలకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, సాతులూరి బాబు, ఎస్.కృపారావు, పి.భారతి, జె రాజశేఖర్ పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: వ్యవసాయ మోటార్లుకు మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టాలని యువగళం పాతయాత్రలో చెప్పిన నారా లోకేశ్ నేడు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నా నోరు మెదపడం లేదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. శుక్రవారం స్మార్ట్ మీటర్లు బిగింపు, విద్యుత్ ట్రూ అప్ చార్జిల పేరిట అదనపు బాదుడుకు వ్యతిరేకంగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈ కార్యాలయంలో జెఏవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. క్యాక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఆంజనేయ నాయక్, టీ పెద్దిరాజు, మండల కార్యదర్శి డీ శివకుమారి, కొమ్ముల నాగేశ్వరరావు, మేడం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. హైవేపై లైన్ మార్పిడి వల్ల వేలూరు రోడ్డు, హైవేకు ఇరుపక్కల పరిశ్రమలు, ఐసీఎం రోడ్డు, మువ్వా వారి వీధి, తిమ్మాపురం పరిశ్రమలు, మద్ది లక్ష్మయ్య గెస్ట్ హౌస్ రోడ్డు ప్రాంతాల్లో గృహ, వాణిజ్య, చిన్న, భారీ పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఉంటుందని తెలిపారు.

## యాక్సిడెంటల్ బీమాతో భరోసా

● రీజినల్ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాజేష్‌బాబు

శావల్యాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ యాక్సిడెంటల్ బీమా పాలసీతో ప్రమాదాల బారినపడి మృతిచెందిన ఖాతాదారుల కుటుంబాలకు ఎస్‌బీఐ ఎంతో భరోసా కల్పిస్తుందని రీజినల్ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వేదం రాజేష్‌బాబు అన్నారు. శావల్యాపురం ఎస్‌బీఐ ఖాతాదారుడైన ఇర్లపాడుకు చెందిన అరుమల్ల లక్ష్మయ్య అక్టోబరు 22, 2024న ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్ళి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గేదెలు అడ్డురావడంతో కింద పడి తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. లక్ష్మయ్య పాయా బీమా పాలసీకి రూ.1000 చెల్లించాడు. దీంతో బీమా నగదు రూ.20లక్షల చెక్కును శావల్యాపురంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రీజినల్ చీఫ్ మేనేజర్ రాజేష్‌బాబు, రీజినల్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, స్థానిక బ్రాంచ్ మేనేజర్ వల్లేటి ప్రసాద్‌లు మృతుని భార్య సామ్రాజ్యంకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నగదు అధికారి శ్రీహరి, బీమా అధికారి సాగర్‌బాబు, సిబ్బంది వీరనారాయణ, ప్రకాష్, ఎస్తేరురాణి పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిరసన

వినుకొండ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి వద్ద మరణించిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిని హత్యానేరంగా పరిగణించి కేసు రిజిస్టర్ చేసి దోషులను కఠినంగా శిక్షించాలంటూ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరువది సుబ్బారావు డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి మహాసభ సందర్భంగా ఆయన వినుకొండ స్థూపం సెంటర్‌లో పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రవీణ్ కుమార్ మరణాన్ని హత్యానేరంగా పరిగణించి కేసును దర్యాప్తు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బొంతు నాగేశ్వరరావు, సోమవరపు దావీదు, దూపాటి మార్కు, మరియదాసు, సోడా సాంబయ్య, మస్తాన్, విప్పర్ల వెంకటేశ్వర్లు, పౌలు, వెంకట్రావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## వీ అప్పాపురం ఇనాం భూములపై నోటిఫికేషన్

నూజెండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ అప్పాపురం ఇనాం భూముల (అగ్రహారం) ఫారం-5 నోటిఫికేషన్ తహసీల్దార్ జీ రమేష్ కుమార్ శుక్రవారం ప్రచురించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో గతంలో సర్వే చేయటం పూర్తయిందన్నారు. ఆంధ్రా ప్రాంతం ఇనాం రద్దు, రైతు వారీగా మార్చటం చట్టం 1986 ప్రకారం ఇనాం భూములను సెటిల్‌మెంట్ చేసేందుకు ఫారం-5 నోటిఫికేషన్‌ను విడుదల చేశామని, వీ అప్పాపురం పంచాయతీ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ఐనవోలు పోలీసు స్టేషన్, తిమ్మాపురం గ్రామాల ప్రజలు తమ భూముల వివరాలు తెలుసుకునేందుకు అందుబాటులో ఉంచామన్నారు. ఇనాం భూములకు సంబంధించిన అభ్యంతరాలు ఉంటే 15రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం ఫారం-6,7 తయారు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో నాసర్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌కే జానీబాషా, శివ కోటేశ్వరరావు, గ్రామ సర్వే సహాయకురాలు వీ ప్రియాంక, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్కాన్ సెంటర్‌ల నిర్వాహకులకు శిక్షణ

నరసరావుపేట లీగల్, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కాన్ సెంటర్ నిర్వాహకులకు శుక్రవారం పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణులకు లింగ నిర్ధారణ చట్టం 1994 నిర్వహణ, భ్రూణ హత్యలు నివారించుట, మెడికో లీగల్ కేర్ గురించి డాక్టర్ బి.రవి వివరించారు. కార్యక్రమంలో గురజాల ఏపీపీ నాగమణి సెక్సువల్ వయొలెన్స్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వరరావు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

నరసరావుపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశానుపల్లి రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు తెలిపారు. పట్టణ శివారులోని 1504 గృహాలకు సంబంధించి అందరికీ రిజిస్ట్రేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కొందరు లబ్ధిదారులకు సిబిల్ స్కోరు తక్కువగా ఉండి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాలేదని అటువంటి వారు నోటీసు అందిన రోజు నుంచి 15 రోజులలోగా నగదును చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లబ్దిదారుల నుంచి స్పందన లేనట్లయితే అట్టి వారి గృహాలు రద్దుపరచి, అర్హత గల వేరే వారికి గృహం మంజూరు చేసేందుకు కమిషనర్ అధికారం ఉంటుందని తెలిపారు.

## స్త్రీనిధి రుణాలపై శిక్షణ

వినుకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు మహిళలకు అవసరాన్ని బట్టి రుణ సదుపాయం కల్పించాలని, 2025-26 సంవత్సరానికి ఎవరెవరికి ఏఏ రుణాలు అవసరమో ముందుగా ప్రణాళికలు తయారుచేయాలని స్త్రీనిధి ఏజీఎం ఆర్.చిన్నబుల్లెయ్య తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వినుకొండ వెలుగు కార్యాలయంలో వీవోఏలకు, ఎన్యూమరేటర్లకు శుక్రవారం రుణ ప్రణాళికలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యులకు తగిన సూచనలు, సలహాలు అందించారు.

## మతుకుమల్లిలో తిరునాళ్ళ కోలాహలం



మతుకుమల్లి ప్రభ

మతుకుమల్లి (శావల్యాపురం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలో ఈ నెల 30న జరగనున్న అడవి పేరంటాలమ్మ తిరునాళ్ళను పురస్కరించుకొని మతుకుమల్లి గ్రామస్థులు శుక్రవారం తిరునాళ్ళ వేడుకలను జనసందోహం నడుమ కోలాహలంగా ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మతుకుమల్లికి విచ్చేసి అడవి పేరంటాలమ్మ తిరునాళ్ళకు మతుకుమల్లి గ్రామస్థులు తరలించనున్న తడిక ప్రభను, యాక్సిలేటర్, కొమ్మతాళ్ళు పట్టుకొని లాగుతూ పైకిలేపి రథంపై ఆవిష్కరించారు. శుక్రవారం రాత్రికి ప్రభకు విద్యుత్ అలంకరణ చేసి అంగరంగ వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 30వ తేదీన బొందిలిపాలెంలోని తిరునాళ్ళ ప్రాంగణానికి ప్రభను తరలించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



నరసరావుపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

## మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్

నరసరావుపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నరసరావుపేట పట్టణంలోని షాదీఖానాలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చిలకలూరిపేట శాసనసభ్యుడు పత్తిపాటి పుల్లారావు, జనసేన నాయకులు సయ్యద్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయం

## ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత


నూజెండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కార్యాలయంలో ఎంపీడీవో, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు మినహా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఈవోపీఆర్‌డీ, సీనియర్ అసిస్టెంట్‌లు లేకపోవటం, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు సెలవులపై ఉండటంతో శనివారం కార్యాలయంలో ఎంపీడీవో ఒక్కరు మాత్రమే విధులకు హాజరయ్యారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి అవసరమైన సమాచారం అందటం గగనంగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో ఉమాదేవిని వివరణ అడగ్గా తమ కార్యాలయంలో ఎంఈవో, ఏఈఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈ, ఉపాధి హామి ఈసీ కూడా ఇన్‌చార్జ్‌లుగా ఇతర మండలాలకు చెందిన అధికారులకు కేటాయించటంతో ఇబ్బందిగా ఉందన్నారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో 35 సచివాలయ సిబ్బంది, 27 పంచాయతీల్లో 12 పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అధికారులు, సిబ్బంది లేకపోవటంతో ఉన్నతాధికారులు అడిగే సమాచారం అందించటం కష్టంగా మారిందని తెలిపారు.

## ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపవేటలో ఏపీటీఎఫ్ (1938) జిల్లా కార్యాలయంలో పల్నాడు జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయిందని బీ సంపత్ బాబు శుక్రవారం తెలిపారు. ఫ్యాప్టో చైర్మన్‌గా ఎల్‌వీ రామిరెడ్డి (ఎస్‌టీయు), సెక్రటరీ జనరల్‌గా బీ సంపత్‌బాబు (ఏపీటీఎఫ్ 1938), కో చైర్మన్-1గా వీ అశోక్ కుమార్, కో చైర్మన్-2గా టీ చంద్రయ్య, కో చైర్మన్-3గా ఎస్‌కే మొహీద్దీన్ బాషా (ఆర్‌యూటీఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్-1గా ఎం మోహన్‌రావు (యూటీఎఫ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్-2గా ఎంఎండీ ఉస్మాన్ (ఏపీటీఎఫ్ 257), కోశాధికారిగా ఆర్ గోవిందరాజులు (హెచ్ఎంఏ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పూనాటి

నరసరావుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పూనాటి శ్రీనివాసరావు నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామం. తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి చురుకుగా పనిచేశారు. రెండుసార్లు నరసరావుపేట మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. శ్రీనివాసరావు తండ్రి పూనాటి రాందాసు పమిడిపాడు సర్పంచ్‌గా రెండుసార్లు పనిచేశారు. ఒకసారి పమిడిపాడు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. పూనాటి శ్రీనివాసరావును మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా ఎంపిక చేయడంపై పార్టీలో, నరసరావుపేట మండలంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.





ఎన్ఎస్‌పీ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆందోళనచేస్తున్న రైతులు

## ఏప్రిల్ చివరి వరకు నీళ్లివ్వాలని రైతుల ఆందోళన

నరసరావుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం వద్ద మిర్చి, వరి, మొక్కజొన్న సాగుచేపట్టిన రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు రామారావు మాట్లాడుతూ పంటలకు ప్రాణాధారమైన సాగునీరు సగంలో ఆపేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే ఆశించిన మేర దిగుబడులు రాక, మద్దతు ధరలు లేక రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. అనంతరం ఎస్ఈ వీ కృష్ణమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, జి.పిచ్చారావు, ఆవుల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బీ నాగేశ్వరరావు, ఈపూరి అప్పిరెడ్డి, కంచర్ల నాగేశ్వరరావు, తిమ్మిశెట్టి హనుమంతురావు, రావెళ్ల వెంకటేశ్వర్లు, కంచర్ల వెంకట కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శావల్యాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కో-ఆపరేటివ్ సంస్థ ఆదేశాల మేరకు శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి నర్రా సురేంద్రబాబు, సీఈవో జాలాది నాగప్రసాద్‌లు పాల్గొని వ్యాసరచన పోటీలను పర్యవేక్షించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ చాందిని షర్మిళ, ద్వితీయ నాగఅఖిల్, తృతీయ స్థానాలను సాధించిన భార్గవిలను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి సురేంద్రబాబు, హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, సొసైటీ సిబ్బంది సుభాషిణి, రామాంజనేయులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలి: వెలుగు ఏపీఎం

శావల్యాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లోని డ్వాక్రా మహిళల అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళికలను తయారు చేయాలని ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు ఆదేశించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, గ్రామసమైఖ్య సభ్యులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఏపీఎం, సీసీలు వీవోఏల ద్వారా ఒక్కో గ్రామ సంఘంలో ఐదుగురిని ఎంపికచేసి ఏప్రిల్ 1నుంచి 7వ తేదీలోపు ఆర్థిక ప్రణాళికలు తయారు చేయించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, సీజీబీ మేనేజర్ వల్లేటి శివకృష్ణ, సీసీ ఖాజా పాల్గొన్నారు.